
# ముక్కుపుడక


వేదుల చిన్నవేంకట చయనులు



రైలు కదిలింది. మరి వెనుకకు తిరగడమన్నది మూర్ఖత్వమే అవుతుంది. రామనాథం అంతటి మూర్ఖుడు కాదు గాని అతని మనస్సు మాత్రం పదేపదే వెనుకకు మళ్ళడం ఆరంభించింది. సుమారు నాలుగు దశల చాకిరీ అయాక, రిటైరయి ఇంక హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చని అనుకోడానికి కూడా సమయం లేదన్నట్లు, వరుసగా విపత్తులు వచ్చి ఊపిరికి కూడా వీలులేకపోయింది.

గత యేడాదంతా పన్ను పీకాలంటే కష్టమయి మందులు మింగమన్నారు. ఆ మందుల రియాక్షనుగా వంటికి రాష్‌లని, వాటి ఉపశమనానికి లేపనాలన్నారు. ఆ లేపనాల వల్ల వచ్చిన బొబ్బలకి ఇంజక్షన్‌లన్నారు. అవన్నీ అవుతూండగానే సలిపిన పన్ను పీకడమయింది. బ్రతికేను దేముడా అనుకున్నాడో లేదో గుర్తు లేదు ఆవిడకి కాన్సరని ముందు విశాఖపట్టణం ఆ మీద హైదరాబాద్, అదీ కాదు, బొంబాయి అని ఊళ్ళు తిరగడమే మిగిలిపోయింది. ఆవిడ మిగలకుండా.

ఆవిడ కాపురానికొచ్చిన వేళా విశేషమన్నారంతా, స్కూలు ఫైనలు బొటాబొటిగా పాసయిన తనకి రైల్వేనౌకిరీ రావడం. అప్పటి నుంచి గతనెల దాకా తనతో మూటా ముడీ కట్టింది బదిలీ అయిన ముప్ఫై చిన్నాపెద్దా ఊళ్లకి. పుట్టింటికి తొలి పురుడికి వెళ్ళింది. ఆ తరువాత మీ కిబ్బంది అంటూ వెళ్తే కలిసి వెళ్ళడమే కాని తను ఒక్కర్తీ వెళ్లనే లేదు.



బదిలీ అయిన అన్ని ఊళ్ళల్లోనూ పార్వతమ్మగారు మా మంచివారు, ఆవిడేగాని లేకుంటే మాకీ పని సాగేదా అంటూ అందరూ ఆవిడ మంచిని చెప్పి కృతజ్ఞతలు చెప్పుకున్నవారే. పై వారికి కాదు ఇంటి వారికి కూడా చేతనైనది చేయడమే గాని నాకిది కావాలని గాని, చేసిపెట్టండని గాని ఆవిడ నోటంటెన్నడూ వినలేదు. అలాంటిది పోతూ అడిగింది ఒక చిన్న కోరిక. అందుకే ఈ ప్రయాణం.

“మీకు అనకాపల్లి గుర్తుందా? పెంటి కూతురుని పాల్ఘాట్ అయ్యరు నటేశన్ పెంచుకుంటానంటే యిచ్చామే” అని ఆవిడ అడిగితే, పెంటెవరు అన్నప్రశ్నతో మొదలయింది రామనాథం ప్రశ్నల వర్షం. కొన ఊపిరితోనే పాపం శాంతంగా గుర్తు చేసింది.

సుమారు యిరవై యేళ్ళకిందటిమాట హఠాత్తుగా పాచిపని చేస్తూ చనిపోయింది పెంటి పదేళ్ళయినా నిండని అమ్మాయిని వదిలి. ఆ పిల్ల పుట్టిన యేడాది తిరుగకుండానే తండ్రి పరారయి మరి పత్తా లేడు.

పాల్ఘాటయ్యరు రైల్వేస్టేషనికి దగ్గరలోనే ఒక చిన్న హోటలు పెట్టుకుని పొట్ట పోషించుకునేవాడు. స్టేషన్ మాస్టారి ఇంట్లో ఒక గది అద్దెకి తీసుకుని ఉండేవాడు. ఆ అయ్యరు భార్య, పక్కింటి చిన్న స్టేషన్ మాస్టారి భార్య అయిన పార్వతమ్మతో పిచ్చాపాటికి రోజూ వచ్చేది. పాపం వాళ్ళకి పిల్లా జెల్లా లేరు. పెంటి వాళ్ళింట కూడాపనిచేసేది. మద్రాసులో ఆవిడ మేనమామ చనిపోతూ నటేశన్‌కి ఆ వ్యాపారం అప్పజెప్పి పోయాడట. అక్కడకి తరలిపోయే సమయంలోనే పెంటి పోవడమూ, దిక్కులేని పిల్లని వాల్లకి పార్వతమ్మ అప్పజెప్పడమూ జరిగాయట.

అయ్యరి కుటుంబానికి అప్పజెప్పేముందు మనమే పెంచుగుంటే బాగుంటుందేమో అని ఊహగానే అని కదిపినట్లూ, మన చిన్న ఉద్యోగంలో మన ముగ్గురు పిల్లలని చూసుగోడానికే దిక్కులేదని నేనంటే కాదన లేక వాళ్ళడుగగానే కన్నీటితో అప్పజెప్పినదీ గుర్తు చేసింది.

ఆ పిల్ల, అదే ముప్ఫైకి పైనే ఉండే మహిళకి తన ముక్కుపుడక తీసుకుని వెళ్లి అందియ్యాలి అనే పార్వతమ్మ ఆఖరి కోరిక.

కర్మకాండలకని వచ్చి పుణ్యావాజనం అవగానే శలవుల్లేవంటూ వెళ్లిపోయాడు. పై దేశంలో కంప్యూటర్ కంపెనీ పనిమీద అమెరికాలో పనిచేస్తున్న అబ్బాయి. వెళ్ళే ముందు మంచీ కాదు అలా అని చెడ్డదీ కాని కబురు చెవిన వేసి వెళ్ళాడు.

నాన్నా వీలయితే అక్కడే ఒక ఉద్యోగం సంపాదించి కొన్నాళ్ళు అక్కడ ఉండి దేశం తిరిగిరావడం మాట తీరికగా ఆలోచిద్దామంటోంది మా ఆవిడ. నిబ్బరంగా బతకడానికి డాలర్లు వెనకవేసేమంటే అప్పుడు మన దేశంలో కాలుమీదకాలు వేసుకుని యే చిన్న ఉద్యోగమైనా చేసి బతికిపోవచ్చు. దీనిలో ఒకటే లొసుగు. నిన్ను తీసుకువెళ్ళడానికి ఓ మూడు నాలుగేళ్ళు పట్టవచ్చు. అక్కడ ఉంచుకుంటే మందూమాకులకి, హెల్త్ ఇన్స్యూరెన్స్‌కీ తడిసిమోపెడు ఖర్చు అవుతుంది కాని దానిలో పదోవంతు పంపితే ఇక్కడ మీరు దర్జాగా ఒకరినెవరినైనా వంటసాయానికి పెట్టుకుని ఉండగలరు అని.

వాడి నిర్ణయమే అది. ఏమంటే నీ ఉద్దేశమేమిటి అని తనని అడుగనేలేదు.

పెళ్ళిళ్ళు చేశాక పరాయి పిల్లలైపోయిన ఆడపిల్లలిద్దరూ వాళ్ళ సంసార బాధ్యతలు వాళ్ళకుండి తమ్ముడు అమెరికానుంచి వచ్చేదాకా ఎలా ఉంటావని ఆతురత చూపించారు గాని అంతదాకా మా యింట్లో ఉండమని పాపం అనలేకపోయారు.

మనసు చివుక్కుమన్నా, రామనాధానికి యెక్కడో చదివినది జ్ఞప్తికొచ్చింది. పిల్లలని కని, పెంచినది తమ ఆనందానికే గనుక పెంచి వారేదో ఘనకార్యం చేశారని, అందుకు గాను పిల్లలు వారికి తిరిగి ఇచ్చేయాలని ఆశ పెట్టుగోవడం అవివేకమే అని, పెంచి పెద్దచేయడం పెట్టుబడి వ్యాపారంకాదు పిల్లలిచ్చిన ఆనందానికి పెద్దలే వారికి ఋణపడి ఉన్నారేమో అన్నది ఆలోచించవలసినదే ననీ.

పిల్లలు పెట్టుబడి వ్యాపారం కాదు. సరే ఈ ముక్కుపుడక వ్యాపారాన్నేమనాలి? ఓ పనిమనిషి కూతురెప్పుడో అన్నాదిట, అమ్మగారూ, మీ ముక్కుడక చాలా బాగుంది, పెద్దయాక నేనూ పెట్టుగుంటానలాంటిది అని. నీ పెళ్ళికి నేచేయించి పెడతాలేఅని అన్నదిట. అయ్యరు కుటుంబానికి అప్పజెప్పినప్పుడామాట గుర్తు రాలేదట. అందుకు పరిహారంగా, దమ్మిడీ ముండకు యేగాణీ క్షవరమన్నట్లు, మహాచేస్తే వందో రెండు వందలకో వచ్చే దానిని అందచేయడానికి అధమం మూడు నాలుగు వేలైనా ఖర్చు పెట్టి, వల్లు హూనం చేసుకుని అందచేయాల్సిన వ్యాపారం. అలా ఆలోచిస్తూ ఉండగా, రామనాథానికి చిరాకులోనే ఒక చిరునవ్వు వచ్చింది. పిల్ల పేరు తెలియదు. నటేశన్ దంపతులు యింకా బ్రతికి ఉన్నారో లేదో తెలియదు. అప్పుడెప్పుడో వెళ్ళిన కొత్తలో రాసిన ఉత్తరంలో ‘మ’ తో మొదలయ్యే పేటో పురమో అని ఎడ్రస్సులో చూసినట్లు గుర్తు అన్నాది. మాద్రాసులో ‘మ’ తో ఆరంభమయే పేటలూ, పురాలూ యెన్ని ఉన్నాయో! అందులో నటేశన్ హోటల్ పేరేమిటో ఇన్నాళ్ళూ అక్కడే ఉంటారన్న గ్యారంటీ యేముంది? ఆ మాటకొస్తే వాళ్ళింకా హోటల్ వ్యాపారమే చేస్తున్నారన్న ఆధారమేముంది?

ఇదంతా ఆలోచిస్తే పేదరాసి పెద్దమ్మా పెద్దమ్మ చెప్పిన కొడుకా కొడుకు చెప్పిన యెలకా అని చిన్నప్పుడు అవతారం మామయ్య చెప్పిన కథలా ఉన్నాది తన ప్రయాణం అనే విచ్చింది ఆ చిరునవ్వు.

కాని మాటిచ్చాడు నాలుగు దశలు సహంభాగమై కలిమిలేమిలు, లేమేయెక్కువేమో, పంచుకుని సేవలు చేసి సంసారసాగరాన్ని సునాయాసంగా సాగనిచ్చిన మహా యిల్లాలుకి. పోతే ప్రయత్నించేది పది రోజులనే తీర్మానించుకుని మద్రాసులో ఉదయం ఇంకా సూర్యోదయం కాకుండానే రైలుబండి దిగాడు.

రిక్షావాడి ధర్మమా అని, స్టేషనుదగ్గరలోనే ఒక చౌకసత్రంలాంటి వసతిలో బస చేసి రామనాథం నటేశన్ ఉనికి ఆరాతీయ మొదలెట్టాడు.

లెఖ్ఖకి ఓ అరడజను ‘మ’ తో ఆరంభమయ్యే పేటలూ, పురాలూ తేలేయి. వాటన్నిటిలో మాంబళం, మైలాపురం, మందవల్లి పెద్ద

ప్రాంతాలు అని వాటితో మొదలయింది నటేశనా న్వేషణ.

మాంబళం, మందవెల్లిలు అయాయి, వారంరోజులలో సాధ్యమైనంత వరకూ రహదార్లు మాత్రమే కాకుండా సందులు గొందులూ, తిరిగి తిరిగి కనబడిన హోటళ్ళే అని కాక పెద్దమనిషిలా ఉన్న ప్రతి ఆసామిని అడిగి చూశాడు. నటేశన్లు దండిగానే ఉన్నా, తనకి కావలసిన నటేశన్ ఉనికి తెలియ లేదు. మైలాపూర్ కూడా చూడడానికి మూడురోజులు ఉంచుకుని తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకున్నాడు.

గడ్డిమోపులో సూదిని వెతకడమంటే యిదే కాబోలు, దేముడా నీదే భారం అని మైలాపూర్ కపాలేశ్వరునికి ప్రణామములు చేసి యెనిమిదవరోజున ఆ చుట్టుపక్కల ఉన్న హోటళ్లల్లో వాకబులు అయేటప్పటికి సాయంత్రమవచ్చింది. అంత వరకూ బీచ్‌కైనా వెళ్ళలేదు. పేరుపొందిన మెరీనా బీచ్‌ని చూడడానికదే మంచి సమయమని, బస్సు యెక్కాడు. ఆ రోజు ఆదివారం, సాయంత్ర ఐదింటి నించే బీచ్ జనంతో నిండిపోయి ఉన్నది. ఇసుకలో కాకుండా పేవ్‌మెంట్ చివరన బెంచీలలో ఖాళీ జాగాకి ఓ ఫర్లాంగు నడిచాక దొరికింది ఒక చిన్న బెంచీ. మరి కొద్దిసేపటికి కచ్చ కట్టుకుని సూటిగా తన బెంచీకే వచ్చి ఆయన కూర్చున్నాడు. బహుశా రోజూ వచ్చి అక్కడే కూర్చునే మనిషిలా అనిపించింది. జనరద్దీతో పనిలేకుండా ఆ నాటి దినపత్రిక తిరగవేయనారంభించాడు. ఆ తరువాత వచ్చే బస్సుల పైనే దృష్టి ఉంచుతూ పేపరు అయిందన్నాక రోజూ పిచ్చాపాటికి వచ్చే నేస్తమింక రాడని ఖాయపరచుకున్నాక, పక్కన ఉన్న అతని మీదకి దృష్టి తిప్పి, ''ఇదివరకు చూసిన గుర్తు లేదు నాపేరు సుబ్బారావు తమరు'' ఇక మీదే పరిచయానికి ఆలశ్యమన్నట్లు రామనాధాన్ని ఆయన కదిపారు.

మాట ఇంగ్లీషు అయినా కట్టు, యాసలని బట్టి తెలుగు ఆయనే అయి ఉంటాడని తెలుగులోనే రామనాథం పరిచయము చేసుకున్నాడు. అంతవరకూ తిరిగి తిరిగి వేసారిన మనసుకి సాటి తెలుగు మనిషితో తన గోడుచెప్పుకుపోతూంటే, మనసు తేలికై నిస్పృహ పటాపంచలై పారిపోయింది. ఎదుట సూర్యాస్తమయ సుందర దృశ్యం మీదపెద్ద మనుషులిద్దరికీ దృష్టి లేనేలేకపోయింది. సుబ్బారావుగారి సానుభూతి పూర్వక స్పందన రామనాథాన్ని చిత్తుచేసి పారేసింది. మరునాడు తను కూడా వెంట వచ్చి సాయం చేస్తానని, అంతటితో ఆపక, రేపు మా యింటే మీ భోజన మని ఆయన ఆప్యాయంగా ఆహ్వానిస్తే అంగీకారము, కృతజ్ఞతలూ చెప్పుకుంటూ, రామనాథం బసకి బస్సు ఎక్కాడు.

పెందలకడనే ప్రారంభిద్దామని అనుకున్నారు కనుక ఉదయం ఎనిమిదింటికే సుబ్బారావుగారు చెప్పిన శ్రీపురం రెండవ వీధి చేరుకుని, ఇంటి నెంబర్లు శ్రద్ధగా పరికిస్తున్న రామనాథం చూపులు చక్కటి తెల్ల దుస్తుల యూనిఫారం వేసుకుని రెండు జడపాయలూ తీరుగా వెనుకకు జతచేసి నుదుట చిన్నబొట్టుతో పక్కన ఉన్న తల్లిచేయి పట్టుకుని మెరిసిపోయే కనులను తిప్పుకుంటూ కిలకిలా నవ్వుతూ తన బరువంత పుస్తకాల సంచీ వీపుకి కట్టుకుని బడికి అడుగులు వేస్తున్న చిన్నారిపై పడ్డాయి. అప్రయత్నంగా టాటా అన్నట్లు చేయి ఎత్తి ఆడించాడు. దానికి ప్రత్యుత్తరంగా ఆ పిల్ల కూడా చేయి ఆడించి చిరునవ్వు సూచించింది. పక్కన ఉన్న ఆ తల్లి బడికి ఆలశ్యమవకూడదన్నట్లు అమ్మాయి చేయి లాగుతూ ముందుకు సాగింది. రామనాధానికి ఎక్కడో చూసిన పాపలా తట్టింది. ఆ వయసులో ఆ పైగా ఆ యూనిఫారాలలో పిల్లలంతా ఒకలాగ ఉంటారులే అని అనుకుంటూ, మరి రెండు అడుగులువేశాడో లేదో, ''టైమంటే టైముకి ఠంచనుగా వచ్చావయ్యా'' అంటూ వీధిగుమ్మంలో నిలుచుని తనకోసమే కాచుకుని ఉన్నట్లు పలకరించి సుబ్బారావు లోనికి ఆహ్వానించాడు.


> **అది అన్నదమ్ములు విభజించుకోవడములో ఒక పెద్ద యింటిలోని భాగమయి ఉండాలి. వీధి వరండా కిటికీ లోంచి కనిపించిన చిన్న హాలులోని ఫోటోలు అడుగకనే చెప్పాయి తను సరెన యింటికే వచ్చినట్టు. గోడకి ఫ్రేములలో పూలదండలతో అలంకరించి, రామనాథంగారూ, రండి రండి అని ఆహ్వానిస్తూన్నట్లు ఉన్నాయి నటేశ అయ్యరు దంపతుల ఫోటోలు.**


ఫలహారమప్పటికే కానిచ్చారు కనుక రెండవ కప్పు కాఫీ సేవించి నటేశన్ గారిని పట్టుకునే ప్రయాసలో పడ్డారిద్దరూ.

తోడు ఉంటే తేలికవుతుందెంత సేపు తిరిగినా దానికి తోడు అక్కడే దాదాపు ముప్ఫై సంవత్సరాలు ఉన్నారు కనుక సుబ్బారావుకి తమిళం బాగా వచ్చు గనుక, ఆరాతీయడం మరీ సులువయింది. కావలసిన నటేశన్ దొరకనందుకు రామనాధానికి యేమీ చికాకవనేలేదు. మధ్యాహ్నం అవవచ్చిందనగానే భోజనానికని సుబ్బారావుగారింటికి తిరిగి వచ్చారు. భోజనమమృతతుల్యంగా ఉండింది. కాస్త విశ్రమించి మూడు దాటి సముద్రగాలి మరలి చల్లగాలి ఆరంభించాక మరికొన్ని వీధులు తిరుగుదామని యిద్దరూ నడుములు వాల్చేరు.

రామనాధానికి మధ్యాహ్న కునుకు అలవాటు లేదు. సుబ్బారావు హాయిగా గుర్రు పెడుతూంటే, యేమేమో గత జీవిత పరిచయాలు, అలవోకగా కనులముందు అల్లలాడసాగాయి. వాటి మధ్య మెరుపుతీగలా జ్ఞప్తికొచ్చింది. రామనాథం వెంటనే యెగిరి గెంతులేసి నిలుచున్నాడు. కదిపి లేపి సుబ్బారావుకది చెప్పాలనిపించింది కాని అతి కష్టం మీద గాఢనిద్రలో పక్కన ఉన్న ఆ స్నేహమూర్తికి నిద్రాభంగం చేయకుండా, తనఅనుమానం తనలోనే యిమిడ్చుకున్నాడు. లేచిన తడవే రామనాథం తను ఉదయము చూసిన పిల్ల గురించి వాకబు చేశాడు. సుబ్బారావు ఆవిడనడుగగా అవతలిపక్కింట పంకజం మంచిపిల్ల వాళ్ల ఆయన ఒక ఇంజనీరని చెప్పింది. వాళ్ళింట్లో పెద్దవాళ్ళెవరూ లేరన్నట్లుగానే చెప్పినప్పుడు ఉత్సాహం కొంత చల్లబడినా, వెళ్ళి పంకజమన్నావిడతో మాటలాడాలన్న ఉబలాట మెక్కువయింది. సుబ్బారావు గారి శ్రీమతి లక్ష్మిని తోడుతీసుకుని కాఫీ అయినా సేవించకుండా, అదంతా ఆ తరువాతనే అని చెప్పి, వెళ్ళాడు.

అది అన్నదమ్ములు విభజించుకోవడములో ఒక పెద్ద యింటిలోని భాగమయి ఉండాలి. వీధి వరండా కిటికీలోంచి కనిపించిన చిన్న హాలులోని ఫోటోలు అడుగకనే చెప్పాయి తను సరైన యింటికే వచ్చినట్టు. గోడకి ఫ్రేములలో పూలదండలతో అలంకరించి, రామనాథంగారూ, రండి రండి అని ఆహ్వానిస్తూన్నట్లు ఉన్నాయి నటేశ అయ్యరు దంపతుల ఫోటోలు. ఆ మాట ఆవిడకి చెప్పగానే ఆవిడ కళ్ళే చెప్పాయి ఆవిడ ఆశ్చర్యసంభ్రమాలు.

కంగారుగానే యారదీ అంటూ డోర్‌బెల్లుకి సమాధానంగా వచ్చి, తలుపుకి వేసి ఉన్న చిల్లులోంచి లక్ష్మిగారిని చూడగానే మీరా అంటూ తలుపు తెరచి పక్కన ఉన్న ఆసామిని చూసిగతుక్కుమని ఆగిపోయింది. చనువుగా లక్ష్మిగారు లోనికి అడుగుపెడుతూ ''రామనాథంగారమ్మా నీ కోసం మన చెన్నై అంతా వారం రోజులయి వెదుక్కుంటున్నారమ్మా'' అని తమిళంలోనే చెప్పా రు. ఆవిడ అయోమయంగానే ఉండిపోయింది రామనాథాన్నిచూస్తూ గడియారం చూసి, పిల్ల స్కూలు నుంచి వచ్చే సమయమని, యిప్పుడే వస్తా ఆంటీ ఉండండిక్కడే అంటూ వీధిలోకి పరుగు తీసింది పంకజ.

ఏమి చేయాలో తెలియక, నలుదిశలూ చూస్తూన్న రామనాథం అప్రమత్తంగా లోనికి అడుగులు వేశాడు. వంటగది పక్కనే ఉన్నచిన్న కొట్టు దగ్గర కాళ్ల బంధమయింది సీతారాముల పటంపక్కనేపార్వతమ్మ ఫోటో చూడగానే అక్కడే చతికిలపోయాడు. వెనుకనే వచ్చిన లక్ష్మిగారికి అర్ధమయి అలాగే నిలుచుండిపోయారు.

కూర్చుని కన్నీటిమున్నీటిధారగా విలపిస్తూన్న రామనాధానికి పంకజ చేతులు జోడించి, పెరియప్పా అని పక్కనే చతికిల పడిపోయింది.

పంకజ పెళ్ళి అయిన యేడాది లోనే నటేశన్ దంపతులు చనిపోయారు. ''నాకింక వేరే యెవరున్నారయ్యా అక్కయ్యలకి నే రాస్తా హాయిగా యే చింతా లేకుండా అన్నయ్య వదినలూ అమెరికాలో ఉండనీ'' అని ఆదరాభిమానాలతో రామనాథాన్ని అట్టిపెట్టి, పిల్లకి శలవులీయగానే, పిల్లతో సహా రామనాథానితో రైలెక్కింది.

అనకాపల్లి నూకాలమ్మకి కృతజ్ఞతలు చెప్పుకుని శ్రీరామపురం అద్దెకొంపకి చెప్పి అందరూ తిరిగి చెన్నైకి రైలుప్రయాణమాయ్యారు. బండిలో పక్కావిడ పంకజం ముక్కుపుడకని మెచ్చుకుంటే ''మా పెరియమ్మది'' అని గర్వంగా చెప్పుకుని పొంగిపోయింది.